క్లుప్తంగా

సీ - విజిల్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

కోవూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎఫ్ఎస్ బృంద సభ్యులు సీ–విజిల్ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కోవూరు ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐదు మండలాలకు సంబంధించిన ఎఫ్ఎస్ బృంద సభ్యులకు సీ–విజిల్ యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సీ–విజిల్ యాప్‌లో నమోదు చేసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి

పొదలకూరు : జగనన్న లేఅవుట్‌లో పేదలకు అందజేసిన ఇంటి నివేశన స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పట్టాలను మండలంలోని మహ్మదాపురం సచివాలయంలో మంగళవారం ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 103 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేసినట్లు వీఆర్వో వెంకటేశ్వర్లు వెల్లడించారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ హరినారాయణన్



దామరమడుగులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కోవూరు : ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని దామరమడుగు, పెనుబల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, సాల్మన్‌పురంలో నిర్మాణంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఓటర్ల వివరాలు, గతంలో ఏమైనా గొడవలు జరిగాయా అనే విషయాలపై ఆరా తీశారు. ఓటు హక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులను సంప్రదించి తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందో ముందుగా తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే తీవ్రమైన కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, తహసీల్దార్ సురేష్‌బాబు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- మండలంలో వంద శాతం పూర్తి



పొలాల వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సీహెచ్ఓ రాజయ్య

మనుబోలు : పోలియో రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీహెచ్‌సీ సీహెచ్ఓ రాజయ్య అన్నారు. మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మూడో రోజు మంగళవారం పొలాల వద్ద నివాసముంటున్న చల్లా యానాదులు, రొయ్యల గుంతల వద్ద కాపలాగా ఉన్న వారు, ఎస్టీ కాలనీల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. దీంతో మండలంలో 100 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. మండలంలో ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులు 4,568 మంది ఉండగా అందరికీ చుక్కలు వేసినట్లు తెలిపారు. ఇందుకోసం మండలంలో గ్రామాల వారీగా 40 బూత్‌లు, ఒక మొబైల్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గేయ పూజిత, డాక్టర్ మోహిసినా సుల్తానాలతో పాటు 45 మంది వ్యాక్సినేటర్‌లు పోలియో చుక్కలు వేశారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు హైమావతి, వెంకట రమణయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మురళీకృష్ణ ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్ కె.రేణుక మండలంలోని బీఎల్వోలకు ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. బూత్ లెవల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం, ఓటింగ్ శాతం పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ప్రతి ఒక్కరినీ చైతన్య పరిచి ఓటువేసేందుకు బూత్ వద్దకు వచ్చే విధంగా బీఎల్వోలు వివరించాల్సిందిగా సూచించారు.

అసత్య ప్రచారాలను ఉపేక్షించేదిలేదు



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: కొందరు రాజకీయ స్వార్థపరులు హద్దులు మీరి అసత్య ప్రచారాలు చేయడంతో పాటు తమ గౌరవంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారని, ఇక నుంచి ఉపేక్షించేదిలేదని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఈ నెల పదిన నిర్వహించనున్న సిద్ధం సభపై కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, నేతలతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని తన నివాసంలో ఎంపీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పద్ధతిగా ఉండాలని.. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల జోలికొస్తే తాటతీస్తామని హెచ్చరించారు. తాను ఎంతో ఉన్నతంగా రాజకీయాలను సాగిస్తున్నానని తెలిపారు. సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని, దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు గౌరి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్ట్ ప్రారంభం



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 32వ డివిజన్ డైకస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్‌ను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నగరంతో పాటు కావలిలో మరో జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో జగనన్న మహిళా మార్ట్‌లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయడాన్ని అభినందించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు తాళ్లూరు అవినాష్, సత్తార్, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు బెజవాడ మేఘునాథ్‌సింగ్, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సమాచార అధ్యక్షురాలు చింతల జ్యోతి, టీఏఎల్ఎఫ్ అధ్యక్షులు నందూరి హరితారెడ్డి, ముంగమూరు భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు సిటీ: అవసరమైన వారికి ఉచిత న్యాయ సాయాన్ని అందించాలనే లక్ష్యంతో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. దొరతోపు కాలనీ సమీపంలోని నేతాజీ వృద్ధాశ్రమంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రెసిడెంట్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ



నెల్లూరు (టౌన్): బోటనీ, మైక్రో బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్‌ను ప్రారంభించారని, దీనికి అనుగుణంగా అధ్యాపకులు నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కన్యాకుమారి, మంజునాథ్, రాజశేఖర్, మక్బూద్ అహ్మద్, వైస్ ప్రిన్సిపల్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): చిలకలూరిపేటలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వెంకటేశ్వరపురంలోని శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పతకాలను సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థులు వసీమ్ అక్రమ్, నవీన్‌ను కరాటే మాస్టర్ అశోక్‌కుమార్, కరస్పాండెంట్ విజయ్ అభినందించారు.

కార్యాచరణను రూపొందించాలి



మాట్లాడుతున్న రత్నకుమారి

నెల్లూరు(బారకాసు): జిల్లాలోని గ్రామీణ, పట్టణ, స్థానిక సంస్థల అవసరాలను అంచనా వేసేందుకు.. ఆర్థిక స్థితిని మెరుగుపర్చేందుకు కార్యాచరణ సిద్ధానికి సూచనలను అందించాలని ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘ కమిషన్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రత్నకుమారి కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత ఆమెను కమిషనర్ వికాస్ మర్మత్ ఆహ్వానించారు. నగరపాలక సంస్థలో రెవెన్యూ వసూళ్లు, ఖర్చులు, పన్నులు, ప్రాథమిక అవసరాల లభ్యత, కేంద్ర, రాష్ట్ర పథకాల్లో భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. సభ్యులు కృపాకర్‌రావు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత



నెల్లూరు సిటీ: సౌత్‌మోపూరులోని వాణిశ్రీ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్‌ను వావిలేటిపాడుకు చెందిన అల్లూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఏఐఎఫ్ అధినేత మస్తానయ్య మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యను అందిస్తున్నారని, తమ పిల్లలను ఇక్కడే చదివించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని చెప్పారు. అన్వర్ హుస్సేన్, శివాజీ యూత్ ఫౌండేషన్ అధినేత మోపూరు భాస్కర్‌నాయుడు, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధినేత కుంచాల విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించడంతో బాలుడి పరార్

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): తండ్రి మందలించడంతో ఇంటి నుంచి బాలుడు పరారయ్యాడు. దీంతో వేదాయపాళెం పోలీసులు బాలుడ్ని మంగళవారం రాత్రి అతని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. బుజబుజనెల్లూరులో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, శ్రీదేవి దంపతుల కుమారుడు స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వమిచ్చిన ట్యాబ్‌ను పాడు చేశాడు. విషయం తెలిస్తే తిడతారనే ఉద్దేశంతో టీచర్ వద్ద ఉందని తల్లిదండ్రులను నమ్మించాడు. ఈ విషయమై గత నెల 14న కుమారుడ్ని శ్రీనివాసులు నిలదీయగా, టీచర్ వద్ద ఉందని బదులిచ్చాడు. అక్కడ ఎందుకు ఉంచావని మందలించడంతో మనస్తాపానికి గురైన బాలుడు ఇంటి నుంచి పరారయ్యాడు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నారాయణ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బాలుడి కోసం నెల్లూరుతో పాటు తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గాలించారు. తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బాలుడ్ని గుర్తించిన పోలీసులు నెల్లూరు తీసుకొచ్చారు. ఈ క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్లో బాలుడ్ని అతని తల్లిదండ్రులకు ఇన్‌స్పెక్టర్ అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘన నివాళి

నెల్లూరు సిటీ: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరి మృతి చెందారు. ఈ క్రమంలో రామ్మూర్తినగర్‌లోని నివాసంలో ఆమె పార్థివదేహానికి ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమిని అప్పగించి రక్షణ కల్పించరూ..

నెల్లూరు(బృందావనం): దేవరపాళెంలో తాము కొనుగోలు చేసిన భూమిని స్థానిక నేతలు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని.. సదరు భూమిని తమకు అప్పగించి రక్షణ కల్పించాలని ఉమాశంకర్, భరత్, శ్రీనివాస్, వెంకటేష్, సురేష్, నారాయణరావు, సత్యవతి కోరారు. ఈ మేరకు వహబ్‌పేటలోని పరివార్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

భద్రతకే అధిక ప్రాధాన్యం

- పోర్టు సీఈఓ జీజే రావు



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఈఓ జీజే రావు

పొదలకూరు (ముత్తుకూరు) : అదాని కృష్ణపట్నం పోర్టులో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. పోర్టులో మంగళవారం తలపెట్టిన 53వ భద్రత వారోత్సవాలను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించి, ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలయ్యేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామన్నారు. వ్యక్తిగత భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ఉద్యోగులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. సీఓఓ రాజన్‌బాబు, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్‌భాస్కరన్, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, రమేష్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో పరిశీలన

కోవూరు : కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ప్రయోగశాలను లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డుల గురించి ఆరాతీశారు అనంతరం ఎక్స్‌రే కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజేత, వైద్యులు వెంకటాచలపతి గౌడ్, పెంచలయ్యతో ప్రత్యేకంగా సమీక్షించారు. డీసీఎం సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ కిశోర్ ఉన్నారు.

సలహాలు, సూచనలు పాటించాలి

కోవూరు : వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను రైతులు తప్పక పాటించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. కోవూరు మండలంలోని పాటూరు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రవేత్తలతో కలిసి వరి పొలాలను పరిశీలించి వివిధ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి యాజమాన్యం, రసాయన ఎరువుల వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త పి.మధుసూదన్‌రావు, ఆత్మ వ్యవసాయాధికారి ఈ.శైలజాకుమారి, ఏఓ ఇందిరావతి, సహాయకులు మౌనిక, చైతన్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

కొడవలూరు: ప్రతి ఒక్కరికి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సామాజిక పరిశుభ్రత అవసరమని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుధ్యంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగతంగా, సామాజికంగా పరిశుభ్రత పాటించకుంటే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు పుష్ప, సుశీల, కోశాధికారి ప్రవీణ, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య పాల్గొన్నారు.

‘ప్రియదర్శిని’లో స్ట్రాంగ్ రూమ్



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈవీఎంలను భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని అంశాలను తెలియజేయగా, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఓటరు దరఖాస్తులపై పారదర్శకంగా విచారణ జరిపి సవరణలు చేపడుతున్నామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజీవ్‌రెడ్డి, బీజేపీ తరపున నరేష్, టీడీపీ నుంచి హరికృష్ణ, ఏఈఆర్వో వెంకటేశ్వరరావు, ఈడీటీ స్వర్ణ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లతో సమీక్ష



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర నియోజకవర్గంలోని సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం నిర్వహించారు. నిర్దేశించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో విస్తృతంగా పర్యటించి వారికి కేటాయించిన విధివిధానాలపై నివేదికలను అందజేయాలని సూచించారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఏఈఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడికి పూజలు



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. రాజరాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన వేదాంతం విధుమౌళి శిష్య బృంద ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఉభయకర్తలుగా వెంకటశివరామ్, బృందాకుమారి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, ధర్మసింగ్, ఈఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పురుషామృగ వాహనంపై మూలస్థానేశ్వరుడు



నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారు పురుషామృగ వాహనంపై మంగళవారం దర్శనమిచ్చారు. చప్పరోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. నగరోత్సవం వేడుకగా సాగింది. ఉభయకర్తలుగా మోహన్, కస్తూరి, జితేంద్రవర్మ తదితరులు వ్యవహరించారు. ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు కోటంరెడ్డి బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): సోషల్ మీడియాలో పోస్టులను ఫార్వర్డ్ చేయడమేమైనా పెద్ద నేరమా.. దీనికి ఇంత హడావుడా.. ఇదే పద్ధతిని అవలంబిస్తే సుప్రీంకోర్టు కెళ్తామని మాజీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీస్ అధికారులను బెదిరించారు. వివరాలు.. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు అందింది. విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని 33వ డివిజన్ టీడీపీ నేత హజరత్‌నాయుడి ఇంటికి వేదాయపాళెం పోలీసులు మంగళవారం వెళ్లి చెప్పారు. ఇంతలో అక్కడికి చేరుకున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీసులపై మండిపడ్డారు. కొద్దిసేపటి అనంతరం పోలీస్‌స్టేషన్‌కు హజరత్‌నాయుడు వెళ్లారు. విచారణ జరిపిన పోలీసులు అవసరమైతే మరో మారు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పడంతో ఆయన వెనుదిరిగారు.

వాటర్ కూలర్ వితరణ



మాట్లాడుతున్న దినేష్‌జైన్

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ప్రెస్‌క్లబ్‌కు వాటర్ కూలర్‌ను సుందర్ హిమ్మత్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దినేష్‌జైన్ మంగళవారం అందజేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా దీన్ని అందజేశామని ఆయన చెప్పారు. శ్రీను, సురేష్, జర్నలిస్ట్ ఇసనాకుల మల్లికార్జున్ పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం
దర్గామిట్ట, నెల్లూరు సిటీ, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా. 94910 00735, 73822 83735
E-mail : endow-eodmitta@gov.in, srirajarajeswariammavaru@yahoo.com

3వ సారి బహిరంగ వేలం/సీల్డ్ టెండరు ప్రకటన

పై దేవస్థానమునకు సంబంధించి 2024-25 సంవత్సరమునకు క్రింద వివరించిన వివిధ హక్కులు లీజుకు ఇచ్చుటకు, వివిధ వస్తువులు సరఫరా చేయుటకు తేది. 14.03.2024 గురువారము ఉ॥ గం. 10.30లకు సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం	వివరములు	ధరావత్తు	ధరావత్తు రూ.
1	దేవస్థాన వేదికలో వివాహాది శుభకార్యములు చేసుకొను హక్కు	01.04.2024 నుండి 31.03.2025	2,00,000/-
2	గాలిగోపురము ముందు ఉత్తరం వైపు పూలు విక్రయించుకొను హక్కు	01.04.2024 నుండి 31.03.2025	1,00,000/-

వరుస నెం.1 నుండి 2 వరకు గల ఐటములకు సీల్డ్ టెండరు / బహిరంగ వేలములో లభించిన హెచ్చు మొత్తములను ఖరారు చేయబడును. టెండరు షెడ్యూలు 1కి రూ. 500/-లు చెల్లించి తేది. 13.03.2024 సా॥ గం. 6.30ల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన షెడ్యూలును తేది. 14.03.2024 ఉ॥ గం. 10.00ల లోపు దాఖలు చేయవలెను.

వ్యవస్థాపక ధర్మకర్త | సహాయ కమీషనరు & కార్యనిర్వహణాధికారి

శ్రీ సాయి చేనేత కాటన్ & సిల్క్ ఎక్స్‌పో



మార్చి 2 నుండి మార్చి 14 (2024) వరకు
ఉదయం 10 గం.ల నుండి రాత్రి 9 గం.ల వరకు